33. జీవితాశయం

డాక్టర్ అన్నాడు: ఏనీ పరిస్థితి చాలా క్లిష్టంగా వుంది. ఆమె యీ కాన్పుకు యమయాతనలు అనుభవించాల్సిందే ! ఇప్పుడు ఆపరేషన్ చేసి బిడ్డను తీసేట్టయితే ఆమె ప్రాణాని కేమీ భయంలేదు, కాని బిడ్డ బతకదు. గర్భకోశపు తిత్తిని కత్తిరించివేయవలసి వుంటుంది కనుక- ఆమెకు మరి సంతానం ఉండదు. ఆపరేషన్ చెయ్యకపోతేమాత్రం బిడ్డ జీవంతోనే బైటపడుతుంది. కాని తల్లి ప్రాణానికి నాకేమీ ఆశ కనిపించటంలేదు- మీ నిశ్చితాభిప్రాయం ఏమిటి?

నిశ్చయం ! ఇలాటి దుర్ఘటనలో నిశ్చయానికి రావటం మానవమాత్రుడి తలకుమించిన విషయం-

“నేను అన్నీ సిద్ధం చేసుకుంటున్నాను. అరగంటలో వొచ్చి మిమ్మ కలుసుకుంటాను. యీలోగా ఏదో వొకటి తేల్చుకోండి” అని డాక్టర్ వెళ్ళిపొయ్యాడు.

సోమ్స్‌కేమీ తోచటంలేదు. తను ఒంటరిగా ఉన్నాడు. తన అత్తగారు మర్నాటి మధ్యాహ్నానికిగాని రాలేదు. విషయం అంతవరకూ ఆగేదికాదు. అరగంటలోనే ఏదో వొక వొద్దు తేల్చుకోవాలి. తనకు ఉన్న కాలమందు ముప్పైనిమిషాలు . ఆ కొద్ది వ్యవధిలోనే ఒక జీవిత సమస్యకు తను జవాబు చెప్పాలి....!

సోమ్స్ చెవులు మూసుకున్నాడు. ఏశబ్దమూ వినిపించకపోవటం మరీ దుర్భరంగా తోచి.. ఫాలభాగాన్ని తడుముకున్నాడు. శీతాకాలపు చలిలోకూడా అతని నుదుటిమీది శ్వేతబిందువులు అతన్ని మరింత భయపెట్టినయ్.

మేడ మీది గదిలో తన భార్య ప్రసవవేదన పడుతూ వుంది. ఆమె బాధతో మూలగటం సోమ్స్ భరించలేకపోతున్నాడు.

తన స్థితితో యీ కాలానికి నిమిత్తం లేదు. తన నిశ్చయం కోసమే ప్రకృతిశక్తులన్నీ వేచికూర్చున్నాయ్. ఆలోచనలతో కాలాన్ని వెళ్ళబుచ్చు తున్నాడేమో? కాని అనాలోచితంగా మాటజారాడంటే జీవితాలే తలక్కిందులౌతవి.

ఆ ముప్పై నిమిషాల్లోనూ అతని కళ్ళ ఎదుట ముప్పై సంవత్సరాల జీవితం కదిలిపోయింది.....

తనకు లెక్కకట్టలేనంత ఆస్తివుంది. తన మొదటిభార్య - ఇరానీ లేచిపోయింది. తన సంపదను ఆమె కాలతన్నింది. ధనం అనేది నిరుపయోగమైనదని నిరూపించే సంఘటనను సృష్టించింది. ఆమె తన పినతండ్రి కొడుకుతో లండన్‌లోనే వేరే కాపరం పెట్టింది. వారు బీదరికంలోనే ఏ ఆనందాన్ని అనుభవిస్తున్నారో తనకు ఇప్పటికీ తేలని సమస్యే ! ఏమైతేనేం? తన భార్య లేచిపోయింది. కాని- ఆమెతోపాటు తన సంపదకానీ, అందులోని భాగంకానీ లేచిపోనందుకు తను ఆనందించాడు. పైపెచ్చు ఆ సంపద క్రమంగా పెరుగుతూనే వొచ్చింది. అంత సంపదనుచూసి తనకు మతిపోయిన క్షణాలు కూడా జీవితంలో లేకపోలేదు.

ఒకనాటి సాయంత్రం యీవినింగ్ ఎడిషన్ దినపత్రికలో 'జననం' శీర్షికలో- ఇరానీ ఒక కొడుకును కన్నట్టు చదివాడు.... తనకు మతి పోయినట్టనిపించింది. తన భార్య- ఒక కొడుకును కనటం ! తనకు భార్యాలేదు; సంతానమూలేదు ! ఎవరున్నారు?

తను ముసలివాడైపోయిన సంగతి అప్పుడే గుర్తొచ్చింది. తన ఆస్తిపాస్తులూ ఇవన్నీ తన తరువాత ఏమయేట్టు? ఒక కుర్రవాణ్ని పెంచుకోవాలనే ఉద్దేశం కలిగింది కాని- తన స్వంతంకాని వస్తువుకు ఇంత విలువను ఇవ్వటానికి అతని మనస్సు ఒప్పుకోలేదు. ఐనా తనకు జీవితంలో ఒక కొడుకు ఉండే అవకాశం ఇంకా ఉండనే వుంది. తన వయస్సును గూర్చి అంతగా భయపడనక్కర్లేదు- ఇంకా షష్టిపూర్తన్నా చేసుకోలేదాయె ! పోతే తనకు కావలసిందల్లా ఒక భార్య ! ఇరానీలాటిది మాత్రం కాదు. ఎలాంటిదో తనకైతే తెలియదు - ఎందుకంటే తను పెళ్ళి చేసుకుంటేనేకాని భార్య రాదు, భార్య వొస్తేనే కాని ఆమె ఎలాటిదో తెలియదు. వొచ్చినా ఆమె లేచిపొయ్యేటంతవరకూ- ఇరానీలాటిది మాత్రం కాదని తను నమ్మగలడు-

ఐతే దీనికొక విరుగుడు ఆలోచించాడు. ఇరానీలాగు కాకుండా, తనకోసం కాకపోయినా తన ఐశ్వర్యానికి కట్టుబడే మనసున్న స్త్రీని తను నమ్మగలడు-

అదృష్టవశాత్తూ ఏనీ అతనికి నచ్చింది. ఆమె బీద కుటుంబంలోనిది. ఆమె తల్లి లండన్‌లో ఒక చిన్న ఇంట్లో చిన్న హొటల్ నడుపుకుంటూ కాలం గడుపుతోంది. ఆ

ఇల్లు కూడా సోమ్స్‌దే- ఎప్పుడైనా ఆ హొటల్‌కు వెళ్ళి ఏనీని చూస్తూండేవాడు. బీదరికంవల్ల ఆమె ఇరవైమూడేళ్ళదైనా ఇంకా కన్యగానే ఉండిపోయింది. బొద్దుగా, గుండ్రని ముఖంతో ఉత్సాహంతో ఉండేది. అంత అందమైనది కాదుకాని అనాకారి మాత్రం కాదు. ఆమె ఆరోగ్యం చూస్తే సోమ్స్‌కు యీర్ష్య కలిగేది. తనకు తెలియకుండానే చాలాసార్లు ఆ హొటల్‌కు వెళ్ళేవాడు. కొన్నిరోజులనుంచీ ఏనీ తనను ఆకర్షిస్తూందనే సంగతి సోమ్స్‌కు యీ క్షణంలోనే నిశ్చయంగా తెలిసింది.

ఇక ఆలస్యం చేయకూడదని ఆమె తల్లి దగ్గరకు వెళ్ళి ఏనీనిచ్చి తనకు పెళ్ళి చెయ్యమని అడిగాడు. మొదట ఇదంతా వేళాకోళమని ఆమె భావించింది. సోమ్స్ పట్టుదల చూసి ఆమె ఆశ్చర్యపోయింది. భూలోకంలో తన కుమార్తెకు ఇంత గొప్ప సంబంధం దొరకుతుందని ఆమె కలగనలేదు. సోమ్స్ డబ్బు విషయంలోకూడా ఆశపెట్టి ఏనీని వివాహమాడాడు.

ఏనీ చాలా అమాయకంగా పెరిగింది. అణుకువతో తన బీదరిక బాధలోనే జీవితాన్ని గడిపేందుకు .అలవాటు పడ్డది. ఆమె ఎక్కువ ఆలోచించే అవకాశం లేకపోయింది. అందుకనే ఆ అమాయకత్వంలోనే సోమ్స్ భార్యగా పూర్వంవలెనే జీవితాన్ని గడపసాగింది. సోమ్స్ జీవితాశయంలో దెబ్బతినలేదు. ఆమె తనకోసమో, తన ఐశ్వర్యం కోసమో కాని కట్టుబడి ఉండిపోయి తన విశ్వాసాన్ని నిరూపించింది.

ఆమె గర్భాన్ని ధరించినప్పటినుంచీ సోమ్స్ తన భూలోకపు ఆనందాలన్నిటినీ అనుభవించినంతగా పొంగిపొయ్యాడు. తన పార్సెటీవంశాన్ని ఉద్ధరించేందుకు ఒక కుమారుడు జన్మించబోతున్నాడనే ఊహ కలిగినప్పుడల్లా అతని మనస్సు ఆనందంతో నిండిపోయేది.

కాని యీ ప్రస్తుత పరిస్థితి ! నిశ్చయంకోసం వేచి కూర్చున్న యీ భయంకర సమస్య !

ఆపరేషన్ చేయకపోతే- తల్లి జీవించటం కష్టం. ఐతేనేం- తన జీవితాశయం- తన బిడ్డ బతికి బైటపడుతుంది. తనకు కావాల్సింది కుమారుడు కాని- భార్యకాదేమో?

తనకు ఏనీమీద ప్రేమలేకపోలేదు. ఆమె ప్రసవవేదన పడుతూ వుంటే తనకు జాలికలగకపోలేదు. కాని ఆమె కనబొయ్యే శిశువు మృతిపొంది బైటపడుతుంది.... ఉత్తరోత్రా ఏనీ గొడ్డుమోతుగానే ఉండిపోవలసి వొస్తుంది. మృతి పొందిన శిశువును చూసి ఏనీమాత్రం దుఃఖపడదా? ఆమె మాతృస్థానాన్ని బలిపెట్టేందుకు ఆమె మాత్రం ఇష్టపడుతుందా?

సోమ్స్ కేమీ తోచకుండా వుంది. జుట్టుపీక్కున్నాడు. చేతుల్తో రొమ్ము బాదుకున్నాడు. తన ఐశ్వర్యమంతా కలిసి తన బిడ్డనో, లేక తన భార్యనో ఏ ఒక్కరినో

మాత్రం రక్షించగలదు. ప్రస్తుతం లోకంలో అందుబాటులో వున్న శాస్త్రజ్ఞానం కూడా అంతవరకే ఉపయోగపడుతుంది.

ముప్పై నిమిషాలూ గడిచినయ్. ముప్పై సంవత్సరాలైనా ఒక నిశ్చయానికి రాలేనేమోనన్నంత భయం సోమ్స్‌కు కలగటంలో ఆశ్చరమేమీ లేదు.

డాక్టర్ వొచ్చాడు. సోమ్స్ నిశ్చయంకోసం వేచి ఉన్నట్టు చూశాడు.

"పరిస్థితిలో మార్పేమీ లేదు- ఏం చెయ్యమంటారూ?" అన్నాడు డాక్టర్ తొందరను సూచించే కంఠధ్వనితో.

'సరే- ఆపరేషన్ చేయవొద్దు' సోమ్స్ ఇదే తన నిశ్చితాభిప్రాయమని నమ్మాడు. ఎందుకు నమ్మవలసి వచ్చిందో చెప్పదగ్గన్ని కారణాలు అతనికీ తెలియవు. అతని గురల్లా ఒక కుమారుడు- వాడికోసం ఎవర్నయినా త్యాగం చేయవలసిన తన బాధ్యతను గుడ్డిగా నమ్మి ఉంటాడు.

"మీకు బాగా అర్థమయిందా? తల్లి ప్రాణాల మీద ఆశేమీ ఉండదు" అన్నాడు డాక్టర్ ఆశ్చర్యంతో.

సోమ్స్ ముఖంలో పెదవులు తప్ప ఇంకేమీ కదలలేదు.

"ఆపరేషన్‌చేస్తే బిడ్డ చనిపోతుందని చెప్పానుకదూ?"

"అవును."

"ఆమెకు మళ్ళీ గర్భధారణకు అవకాశం ఉండదుగా?"

"అందుకనే ఆపరేషన్ చేయవొద్దు."

"ఆ బాధను భరించటం చాలా కష్టం-"

"ఫర్వాలేదు. ఏనీ చాలా ఆరోగ్యంగా పెరిగింది. ఆమె బలిష్టురాలు బాధను భరించగలుగుతుంది"

డాక్టర్ ఆశ్చర్యపొయ్యాడు. తను ఏమనుకున్నాడో - మానవత్వం అనేది ఏరూపంలో కనిపిస్తుందని తను ఆశించాడో- దాని విరుద్ధరూపాలు చూసేప్పటికి అతని గొంతు తడి ఆరింది.

"ఏమో- మీ ఇష్టం...... ఇది నేనే నిశ్చయించుకోవాల్సివొస్తే- తప్పకుండా ఆపరేషన్ చేసితీరేవాణ్ని"

డాక్టర్ కోపంతో పైకి వెళ్ళిపొయ్యాడు.సోమ్స్ బుర్రలో మళ్ళీ ఆలోచనలు తిరగసాగాయ్ !

రేపు ఉదయానికల్లా ఏనీ శవాన్ని తన చేతులమీదుగా భూస్థాపన చేయవలసి వుంటుంది. ఆ విధంగా అనుకోవటం రాక్షసత్వమే అవుతుంది. చప్పుడు కాకుండా

కిటికీ దగ్గరకు వెళ్ళి బైటికి చూశాడు. ఆ చీకట్లో కూడా ఆకాశంలోని నక్షత్రాలు కాంతివంతంగా మెరుస్తున్నయ్. చలిగాలి వీస్తోంది. ఆకాశమంతా నిశ్చలంగా వుంది.....

ఇదే తన ప్రాణమైతే యీ విధంగా ప్రవర్తించేవాడా? ఏమో ! ఆమె తన బిడ్డకోసం, తన భర్తనే త్యాగం చేసేదేమో? లేకుంటే, మాతృప్రేమకు అర్థం వుండదు! ఏనీలాటి బీదదాని దగ్గర్నుంచి తనలాటి పెద్దమనిషి కోరేదేమిటి? ఒక కుమారుడు- ఆమె ఇవ్వగలిగిన కనీసపు కానుక. లేకుంటే యీ వివాహానికి అర్థమే ఉండదు !

అతి బాధాకరమైన యీ తలపు లన్నిటినీ ఇంకో దిక్కుకు తరిమేందుకు ప్రయత్నించాడు. తన ఇంటిలోని అతి విలువైన సామానుల్ని గూర్చి... యీ ఇంటిలోకి కొత్తగా జననమొందే బిడ్డకోసం కొన్ని ఆటవస్తువులూ, ఇతర సామగ్రిని గూర్చీ ఆలోచించసాగాడు. జీవితంలో ఇప్పుడు తను తీసుకున్న రిస్క్ ఇదివరకెప్పుడూ తీసుకోలేదు. తీసుకోవలసివుంటుందని కూడా తనెప్పుడూ అనుకోలేదు. రేపు అత్తగారు వొచ్చి... తన సంతానాన్ని పొట్టనుపెట్టుకున్నందుకు తనను కడిగిపారేస్తుందేమో ? ఏ ఆలోచనల జోలికైతే పోగూడదనుకున్నాడో ... అవ్వే తిరిగి తిరిగి అతన్ని బాధించసాగినయ్...

ఏమైనా తనలో పురుషత్వం ఇంకా చావలేదు. వజ్ర కాఠిన్యంలాంటి దేదో తన హృదయంలో ఉండటంవల్ల తను యీ సమస్యను ఇంత ధైర్యంగా ఎదుర్కోగలిగాడు. ఎన్ని ఆలోచనలు వొచ్చినా తను చలించకూడదు!

కాస్సేపు నిద్రపోతే బాగుండుననిపించింది. కాని క్షణాలు గడుస్తూన్న కొద్దీ పెరిగే ఆతృత అతని మనశ్శాంతిని దూర దూరాలకు తరిమివేయసాగింది. పురిటి గదిలోంచి ఉండి ఉండి వెలువడే ధ్వనులతో అతను ఒణికిపోతున్నాడు - లోపల... ఏమౌతోందో అర్థమైకాదు కాని... ఏదో అశుభంజరగబోతోందని గట్టిగా తనకు తెలుసు కనుక! సోమ్, శిలా ప్రతిమవలె అలాగే నిలబడిపొయ్యాడు. కనీసం కూర్చుందామని కూడా అతనికి తోచలేదు.

పైనుంచి ఒక నర్స్ వొచ్చింది. ఆమె ఫాలభాగంమీద బడలిక, ఎంతో శ్రమపడ్డ చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నవి. సోమ్స్ ఒక మూర్ఖుడివలె ఆమెవైపు పరుగెత్తాడు. ఏదో ఒక వార్త వింటే కొంత మనశ్శాంతి చిక్కుతుందని అతని ఆశ.

"సార్! అంతా పూర్తయింది" అంది నర్స్

"పూర్తి? అంటే... సరిగ్గా చెప్పు."

ఆమె ఊపిరి పీల్చుకుంటోంది; ఆ ఆలస్యాన్ని కూడా సోమ్స్ భరించ లేకపొయ్యాడు.

"చెప్పు... త్వరగా!"

"బిడ్డా తల్లీ కూడా బతికే ఉన్నారు" అందామె.

సోమ్స్‌లో యీ వార్త వెంటనే చలనాన్ని కలిగించలేకపోయింది. ఎందుకంటే యీ శుభవార్తకోసం అతను వేచి కూర్చోలేదు. నాలుగైదు క్షణాలు గడిచాక కాని అతను విన్న మాటల అర్థం తెలియలేదు.

ఇప్పుడు సోమ్స్ ఆనందానికి మేరలేదు. కఠిన విధిని రిస్క్‌తో ఎదుర్కొన్నాడు. ఒక వీరపురుషుడివలె నిలబడగలిగాడు. తను భయపడలేదు. ఆ విధిని లెక్క చెయలేదు. అందుకనే తనకీ విజయం... ఆ ఆనందంతో సోమ్స్‌కు నాట్యం చేయాలనిపించింది. తనకు భార్యో, కుమారుడో కాదు... ఇద్దరూ దక్కారు. తన జీవితమే ధన్యమైంది!

డాక్టర్ వొచ్చాడు.

"నేను మిమ్ము అభినందిస్తున్నాను. మీ ధైర్యానికి మెచ్చి ఆ విధి ఇద్దర్నీ రక్షించాడు. చాలా అదృష్టం! బిడ్డ కనుక మగవాడైనట్టయితే తల్లి యీపాటికి శ్మశానంలో ఉండవలసింది" అన్నాడు డాక్టర్.

"ఏమిటీ... ఆడబిడ్డా?"

"ఔను మొగబిడ్డ కాదు కనుకనే అదృష్టవంతుడివి."

సోమ్స్ కొయ్యబారిపొయ్యాడు. క్షణంలో అతని ముఖం నల్లబడ్డది. తన తలమీది బరువంతా దిగిపోయిందనే ఆనందంలో ఉండగా, అంతకన్నా పెద్దబరువు నెత్తినపడ్డది. ఒక కుమార్తె కోసమైతే తను యీవిధంగా రాక్షసుడల్లే ప్రవర్తించేవాడు కాదు. విధితోడి యీ పోరాటానికి దిగేవాడు కాదు.

సోమ్స్ చాలాసేపటి వరకూ అలాగే కొయ్యబారి, ఎదురుగుండా వున్న ఫార్సైటీకుటుంబపు ఫొటోనుచూస్తూ నిలబడిపొయ్యాడు.

గాల్స్‌వర్దీ అనుసరణ

- సెప్టెంబర్, 1948